ప్రజాశక్తి
బుధవారం 26 మార్చి 2025 | 5 | శ్రీసత్యసాయి

## భూ వివాదం.. మాటల యుద్ధం..!



◆ ఉమ్మడి జిల్లాలో భూ వివాదాలు
◆ రాప్తాడులో వైసిపి, టిడిపి మధ్య మాటల యుద్ధం
◆ సత్యసాయి జిల్లా కూటమిలో కుమ్ములాట

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూ వివాదాలు ఒక్కొక్కటికిగా చెలరేగుతూనే ఉన్నాయి. ఇటీవల అనంతపురం నగర శివారులోని విద్యారణ్య నగర్‌లో చోటు చేసుకున్న భూ వివాదం అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి మధ్య మాటల యుద్ధాన్ని రాజేస్తోంది. భూములను అధికారపార్టీ నేతలు కాజేసే కుట్ర చేసి ఎన్నో ఏళ్ళుగానున్న సామాన్య జనాన్ని నిరాశ్రయులు చేసారని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. ఇప్పుడు తొలగిస్తున్న 69 సెంట్ల స్థలమే కాకుండా ఇంకా పెద్దఎత్తున భూములను తమ వశం చేసుకునే ప్రయత్నాలను అధికార పార్టీ నాయకులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. శోత్రీయం భూముల పేరుతో ప్రజలను వెళ్లగొట్టే ప్రయత్నాలు సాగుతున్నాయని, వాటిని న్యాయపరంగా ఎదుర్కొంటామని ఆయన చెబుతున్నారు. దీనికి ప్రతిగా టిడిపి నాయకులు ప్రకాష్‌రెడ్డిపై ప్రత్యారోపణలు చేస్తున్నారు. ఇలా రెండు పార్టీల నడుమ గత రెండు రోజులుగా మాటల యుద్ధం నడుస్తోంది.

సత్యసాయి జిల్లాలో భూ వివాదాలు జోరుగా సాగుతున్నాయి. ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ యాదవ్ మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, బిజెపి నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డిలపై ఆరోపణలు చేశారు. కియా పరిశ్రమ వద్దనున్న 200 ఎకరాల భూముల విషయంలో గత కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. అది ఇటీవల తారా స్థాయికి చేరింది. ఇది నడుస్తున్న క్రమంలోనే అడవిబ్రాహ్మణపల్లి వద్ద గిరిజన భూములను ఎంపిపి ఆదినారాయణ కాజేసారంటూ మరో రకమైన ఆరోపణబ తెరపైకి వచ్చింది. దీనిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. వీటిని ఆయన అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా అధికారులు ప్రకటించినట్టు ప్రకటనలు సోషియల్ మీడియాలు గత కొన్ని రోజులుగా చక్కర్లు కొడుతున్నాయి. అనంతపురం జిల్లా తాడిపత్రిలోనూ భూముల విషయాల్లో అధికార, ప్రతిపక్షపార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ భూములను వైసిపి నేతలు కాజేసారంటూ అధికార పార్టీ నేతలు ఆరోపిస్తుండగా, వాటికి ప్రతివిమర్శలు వైసిపి నేతలు చేస్తున్నారు. ఇద్దరి మధ్య మాటల యుద్ధాలు తారా స్థాయికి చేరుతున్నాయి. భూముల చుట్టూ రాజకీయాలు నడుస్తున్నాయి. రాజకీయా పార్టీల నాయకుల పరిస్థితి ఇలా ఉంటే సామాన్యులు మాత్రం ఇళ్ల స్థలాలు, సాగు భూమి కోసం నేటికీ ఎదురు చూసే పరిస్థితులు నెలకొన్నాయి. రెవెన్యూ సదస్సుల్లో అత్యధికంగా భూ సమస్యలొచ్చాయి. వాటి పరిష్కారాలు మాత్రం నామ మాత్రంగానే ఉండడం గమనార్హం.

పుట్టపర్తిలో పేదలతో కలిసి ప్రదర్శన చేస్తున్న సిపిఎం నాయకులు

మహాధర్నా సందర్భంగా ప్రసంగిస్తున్న వి.రాంభూపాల్

# సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

◆ ఎన్నికల హామీలన్నీ అమలు చేయాలి
◆ ఉపాధి బిల్లులు, పక్కా గృహాలు ఇవ్వాలి
◆ రైతులకు నష్టం చేకూర్చే హంద్రీనీవా లైనింగ్ పనులను అడ్డుకుంటాం
◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్,
◆ ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి
◆ ప్రజా సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి కలెక్టరేట్ వద్ద మహాధర్నా

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

జిల్లాలో పేదల సమస్యల పరిష్కారం, ఎన్నికల హామీలను అమలు చేకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తే ప్రజలతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని ఆ పార్టీ, ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్ ఎదుట మంగళవారం నాడు మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, కూలీలు, మహిళలు, పేద ప్రజలు హాజరయ్యారు. ముందుగా ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రజలు ఎర్రజెండాల చేతబట్టుకుని కలెక్టరేట్ వరకు మహాప్రదర్శన నిర్వహించారు. ఉపాధి పెండింగ్ బిల్లులు ఇవ్వాలని... పక్కా గృహాలు వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలని.. ఎన్నికల హామీలు చేయాలని ప్రదర్శనలో నినాదాలు చేశారు. కలెక్టరేట్ వద్ద మండుటెండలో బైటాయించి నినాదాలు చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు ఈఎస్.వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ధర్నా చేపట్టారు.

**ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం ఎందుకు..?**
**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.రాంభూపాల్**

ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పరిష్కరించకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని కూటమి ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ ప్రశ్నించారు. మహాధర్నాలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో టిడిపి హయాంలో అసంపూర్తిగా నిర్మించిన టిట్కో ఇళ్లను వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోలేదన్నారు. వైసిపి హయాంలో 32,856 జగనన్న ఇళ్ల మంజూరు అయితే ఇందులో మూడు వేల ఇల్లు కూడా పూర్తి కాలేదన్నారు. పుట్టపర్తి మున్సిపాల్టీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో 1600 ఇళ్లు మంజూరు కాగా అందులో కేవలం 260 పూర్తి అయ్యాయని చెప్పారు. ఈ నిర్మాణాలు జరిగిన ప్రాంతంలో కూడా మౌలిక సదుపాయాలు లేక అక్కడ ఇళ్లు నిర్మించుకున్న పేదలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. టిట్కో గృహాలు పూర్తి కాకనే బ్యాంకుల నుంచి అప్పు కట్టమని పేదలకు నోటీసులు ఇస్తున్నారని తెలిపారు. పేదులకు రెండు సెంట్లలో ఇంటి నిర్మాణం చేసి నిలువ నీడ ఇచ్చేందుకు కూడా పాలకులకు చేతులు రాకపోవడం దుర్మార్గం అన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో కార్పొరేట్ అదానీకి 32 వేల ఎకరాలను అప్పనంగా కట్టబెట్టేలా ప్రభుత్వం అన్ని చర్యలూ పూర్తి చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా దళిత, గిరిజన గ్రామాలకు శ్మశాన వాటికలు లేవన్నారు. హిందూపురం ప్రీకాట్ మిల్లు ద్వారా ఉపాధి పొందుతున్న కార్మికులను వీధిన పడేసేలా ఈ పరిశ్రమ మూతబడుతున్నా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ స్పందించక పోవడం విచాకరం అన్నారు. ఈ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.

**హంద్రీనీవా లైనింగ్ పనులు చేస్తే అడ్డుకుంటాం**
**ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి**

సీమ ప్రజలు, రైతులకు తీవ్ర నష్టాన్ని చేకూర్చేలా ప్రభుత్వం హంద్రీనీవా లైనింగ్ పనులు చేపడితే రైతులు, కూలీలతో కలిసి తాము అడ్డుకుంటామని ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. మహాధర్నా సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీమ ప్రజలకు హంద్రీనీవా ఎంతో ముఖ్యమైనదని చెప్పారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి హోదాలో హంద్రీనీవా కాలువ వెడల్పు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు అందుకు విరుద్ధంగా లైనింగ్ పనులు చేపట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కాలువ లైనింగ్ పనులు చేస్తే భూగర్భ జలాలు అడుగంటి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని చెప్పారు. కుప్పంకు నీరు అందించాలనే కుట్రతో అనంత, కడప, కర్నూలు జిల్లా రైతులకు అన్యాయం చేయొద్దని ముఖ్యమంత్రిని కోరారు. ఈ జిల్లా రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని లైనింగ్ పనులు ఆపి, వెడల్పు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న 12 నెలల బిల్లులను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. రైతులు పండించిన పంటలన్నింటికీ గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నింటినీ ఎలాంటి షరతులూ లేకుండా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతపురం సమస్యలతో కూడిన వినతిపత్రాలను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, రైతు సంఘం, సిఐటియు నాయకులు హరి, జంగాలపల్లి పెద్దన్న, జిఎల్.నరసింహులు, శ్రామిక మహిళా సంఘం జిల్లా కార్యదర్శి దిల్షాద్, జెడ్పీ శ్రీనివాసులు, ప్రవీణ్ కుమార్, లక్ష్మీనారాయణ, పెద్దన్న, ఎస్ఎఫ్ఐ పవన్, పైపల్లి గంగాధర్, పెదపల్లి బాబా పలువురు మహిళలు పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

## దాచుకున్న డబ్బుకు ఎసరు..!

◆ చిట్టీల నిర్వాహకుడు మృతి
◆ డబ్బు చెల్లింపునకు తమకేం సంబంధం లేదన్న కుటుంబ సభ్యులు
◆ కోట్లలో నష్టపోయిన బాధితులు
◆ పోలీసులకు ఫిర్యాదు

**ప్రజాశక్తి-పరిగి**

భవిష్యత్తు అవసరాల కోసం సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలు వారి సంపాదనలో కొంత మొత్తాన్ని దాచుకుంటూ ఉంటారు. ఇందుకోసం ఎక్కువగా చీటీలను వేస్తూ నెలనెలా కంతుల రూపంలో చెల్లిస్తూ ఉంటారు. ఇలా చీటీల వేసే వారితో డబ్బులు వసూలు చేసి తిరిగి ఇవ్వకుండా మోసం చేస్తున్న ఘటన ఇటీవల తరచూ వెలుగు చూస్తుంటాయి. అలాంటి ఘటనే శ్రీ సత్యసాయి జిల్లా పరిగి మండలం కొడిగినహళ్లి గ్రామంలో వెలుగు చూసింది. బాధితులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కొడిగెనహళ్లికి చెందిన విశ్వనాథ్ గత 15 సంవత్సరాలుగా ఇదే గ్రామంలోని కెనరా బ్యాంక్ సమీపంలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈ ప్రాంతంలో ఎక్కువ శాతం ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, మధ్యతరగతి కుటుంబ సభ్యులు జీవనం సాగిస్తున్నారు. చీటీలను నిర్వహించే విశ్వనాథ్ ఇలాంటి వారందరితోనే నెలనెలా చీటీలను వేయించుకున్నాడు. గత 10 సంవత్సరాలుగా ఈయన చీటీల నిర్వహణ కొనసాగిస్తున్నాడు. రూ.30 లక్షల చీటీ వేస్తే ప్రతి నెలా రూ.10వేలు ప్రకారం 30 నెలలు కంతు చెల్లించాల్సి ఉంటుంది. చీటీ వేసిన వారు చివరి నెల వరకు ఉంటే వారికి రూ.3.70 లక్షలను నిర్వాహకుడు ఇస్తాడు. విశ్వనాథ్ వద్ద చీటీలు వేసిన చాలా మంది నెలనెలా కంతులు చెల్లించి చివరి వరకు ఉండేవారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా ఇటీవల విశ్వనాథ్ అనారోగ్యంకు గురై ఆసుపత్రిలో చేరాడు. దీంతో ఆందోళన చెందిన చీటీలు వేసిన వారు ఆయన కుటుంబ సభ్యులను సంప్రదిస్తే ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి బాగా లేదని, చీటీల నిర్వహణను తాము చూసుకుని అందరి డబ్బులు చెల్లిస్తామంటూ విశ్వనాథ్ భార్య జ్యోతి, కుమార్తె భూమిక, అల్లుడు నాగేంద్రలు భరోసా ఇచ్చారు. ఇలా ఉండగా విశ్వనాథ్ ఆరోగ్య పరిస్థితి విషమించి గత నెల 15వ తేదీ మరణించాడు. దీంతో ఒక్కసారిగా చీటీలు వేసిన వారు గందరగోళంలో పడ్డారు. విశ్వనాథ్ ప్రస్తుతం నడపుతున్న చీటీలకు సంబంధించి రూ.1.30 కోట్లు చెల్లించాల్సి ఉంది. దీనికితో మరో రూ.ఐదు కోట్ల వరకు చీటీల వేసిన వారికి ఇవ్వాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ డబ్బులు ఇవ్వమని బాధితులు విశ్వనాథ్ కుటుంబ సభ్యులను అడిగితే తమకేం సంబంధం లేదన్నట్లు మాట్లాడారు. దీంతో ఖంగుతున్న బాధితులు పోలీసులను ఆశ్రయించారు. విశ్వనాథ్ భార్య, కుమార్తె, అల్లుడిపై ఎస్ఐ రంగడుకు ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై 316/2, 318/4,54/ చిట్ ఫండ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

**అనంతపురం కలెక్టరేట్ :** జిల్లా వ్యాప్తంగా ధీర్ఘకాలికంగా నెలకొన్న ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఏవో భాస్కర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాల సమస్యలతో వందలాది మంది ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. జెడ్‌పిపిఎఫ్ ఖాతాలకు సంబంధించి సుదీర్ఘ కాలంగా మిస్సింగ్ క్రెడిట్స్ నవీకరణ సమస్యను పరిష్కరించాలని కోరారు.

అధికారులతో మాట్లాడుతున్న కాలనీవాసులు

## ఎస్టీ కాలనీలో విద్యుత్ కనెక్షన్ల తొలగింపు

**ప్రజాశక్తి - ధర్మవరం రూరల్**

ధర్మవరం రూరల్ మండల పరిధిలోని ధర్మపురి ఎస్టీ కాలనీలో మంగళవారం విద్యుత్తు అధికారులు విద్యుత్‌కనెక్షన్లను తొలగించారు. దీంతో బాధితులు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ లకు ఉచిత కరెంటు ఇస్తామని 2014 లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని, 2019 లో అధికారం చేపట్టిన వైయస్సార్ పార్టీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కూడా ఎస్సీ ఎస్టీలకు ఉచిత కరెంటు అమలు చేసిందని అన్నారు. ఇప్పుడు ధర్మపురి ఎస్టి కాలనీలో ఏ ఈ జానకి రామయ్య, డీఈ శివరాం, హెల్పర్ గోపాల్ నాయక్ వచ్చి కరెంటు బిల్లులు కడితే కరెంట్ ఇస్తామని లేనిపక్షంలో కరెంటు వైర్లు తొలగిస్తామని చెప్పడం అన్యాయమన్నారు. 200 యూనిట్లు కంటే ఎక్కువ వినియోగించుకున్నారని చెబుతూ వేలాది రూపాయల బిల్లులు కట్టమని చెపుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పనులు చేసుకుని జీవించే తాము వేలాది రూపాయల బకాయిలు కట్టలేమని అన్నారు. ఇప్పటినుంచి నెలకు 200 యూనిట్లు కంటే ఎక్కువ కరెంటు కాలితే బిల్లు కడతామని అన్నారు. అయినప్పటికీ విద్యుత్ అధికారులు తమ కాలనీకి విద్యుత్‌సరఫరా లేకుండా చేశారని ఎస్టీ కాలనీ వాసులు వాపోయారు.

## అంతర్‌రాష్ట్ర ద్విచక్రవాహన దొంగలు అరెస్టు

### రూ.16 లక్షల విలువజేసే 18 వాహనాలు స్వాధీనం

**ప్రజాశక్తి-అనంతపురం**

ద్విచక్రవాహనాలను సులువుగా దొంగలించే అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను అనంతపురం సిసిఎస్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.16 లక్షలు విలువజేసే 18 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధి ంచిన వివరాలను మంగళవారం జిల్లా పోలీసు కాన్ఫిరెన్స్ హాల్లో అదనపు ఎస్పీ డివి రమణమూర్తి వెల్లడించారు. అనంతపురం భవానీనగర్‌కు చెందిన వనరస జితేంద్ర, అలియాస్ సిద్దు, అనంతపురం ఇందిరాగాంధీ నగర్‌కు చెందిన షేక్ తౌహీద్, శ్రీసత్య సాయి జిల్లా కదిరి మండలం, ముత్యాల చెరువు గ్రామానికి చెందిన నల్ల నాచప్పగారి గణేశ్, నూర్‌మహమ్మద్‌తో పాటు మరో మైనర్ బాలుడు కలిసి దొంగతనాలు చేస్తుండేవారు. వీరంతా మూడు ముఠాలుగా ఏర్పడి అనంతపురం, కడప జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు ఎత్తుకెళ్లారు. వీరంతా జూదం, తాగుడు వ్యసనాలకు అలవాటుపడి దొంగతనాలు చేయడం ప్రారంభించారు. జిల్లాలో దొంగలపై నిఘా వేయాలని అనంతపురం ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు పోలీసులు నిఘా పెంచారు. ఇందులో భాగంగా అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అనంతపురం సిసిఎస్, అనంతపురం వన్‌టౌన్, త్రీటౌన్ సిఐలు ఇస్మాయిల్, జైపాల్ రెడ్డి, రాజేంద్రనాథ్ యాదవ్, శాంతిలాల్, సిబ్బంది ప్రత్యేక బందంగా ఏర్పడి నిందితులు కోసం గాలించారు. ఇందులో భాగంగా అందని సమాచారం మేరకు అనంతపురం ఎస్‌జెఆర్ ఫంక్షన్ హాల్ వద్ద నిందితులను మంగళవారం నాడు అరెస్టు చేశారు. వీరి నుంచి వివిధ కంపెనీలకు చెందిన రూ.16 లక్షలు విలువజేసే 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలను చూపుతున్న పోలీసులు

## 'సత్యసాయి' పైప్‌లైన్ లీకేజీ

### 30 గ్రామాలకు నిలిచిన తాగునీటి సరఫరా

ఊడిపోయిన పైప్‌లైన్ కప్లింగ్‌కు జరుగుతున్న మరమ్మతులు

**ప్రజాశక్తి - బత్తలపల్లి**

బత్తలపల్లి– అనంతపురం జాతీయ రహదారి మధ్యలో పుట్టపర్తికి వెళ్లే సత్యసాయి తాగునీటి పథకం ప్రధాన పైపులైన్ లీకేజీ అవుతుండడంతో దాదాపు 30 గ్రామాలకు సత్యసాయి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. చిత్రావతి నది నుండి సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి వెళ్లే ప్రధాన పైప్‌లైన్ బత్తలపల్లి మీదుగా వెళ్తోంది. బత్తలపల్లి నుండి అనంతపురం వరకు నిర్మించిన నాలుగు లైన్ల రహదారి క్రింద ప్రధాన పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. బత్తలపల్లి పోలీస్ స్టేషన్ సమీపాన జాతీయ రహదారి కల్వర్టు క్రింద ప్రధాన పైప్‌లైన్ జాయింట్ కప్లింగ్ విరిగిపోవడంతో నీరు లీకేజీ అవుతోంది. గుర్తించిన సిబ్బంది జాతీయ రహదారి మధ్యలో సుమారుగా 20 అడుగుల లోతు త్రవ్వి కల్వర్టు కింద ఉన్న పైప్ లైన్ లీకేజీని గుర్తించారు.గత మూడు రోజులుగా సత్యసాయి తాగునీటి పథకం సూపర్వైజర్లు శంకరయ్య, రాజారెడ్డి పర్యవేక్షణలో దాదాపు 20మంది సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలకు సత్యసాయి తాగునీటి పథకం నీరే ప్రధాన దిక్కు. అసలే వేసవి కాలం కావటంతో పలు గ్రామాలలో నీటి సమస్య నెలకొంది. ఈ నేపథ్యంలో సత్యసాయి నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బత్తలపల్లి, తాడిమర్రి, ధర్మవరం మండలాల్లోని పలు గ్రామాలలో సత్యసాయి నీరు నిలిచిపోయిందని మంగళవారం రాత్రికి పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతు చేసి బుధవారం సత్యసాయి నీరు అందేలా చూస్తామని సూపర్వైజర్లు పేర్కొన్నారు.

## అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

పడిపోయిన అరటిచెట్లను పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్, తదితరులు

**ప్రజాశక్తి - తాడిమర్రి**

అకాల వర్షం, వడగండ్ల వానకు పంటలు కోల్పోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. శనివారం రాత్రి తాడిమర్రి మండలంలో వడగండ్లు, అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. దాడితోట పంచాయతీలోని దాడితోట, తురకవారిపల్లి, నాయనపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. పంట నష్టపోయిన రైతులతో కలసి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. 252 ఎకరాల్లో అరటి, 2ఎకరాల్లో తమలపాకు, 5ఎకరాల్లో దానిమ్మ తోటలు దెబ్బతిన్నాయని మొత్తం 120మంది రైతులకు నష్టం వాటల్లిందని అధికారులు చెప్పారు. బాధిత రైతు పెద్ద వీరనారప్ప మాట్లాడుతూ తాను 4ఎకరాల్లో అరటి పంట సాగు చేయగా.. ఆదివారం నుంచి కోతలు చేయాల్సి ఉందన్నారు. మొత్తం 50టన్నుల దిగుబడి రాగా.. టన్ను 16వేల చొప్పు కొనుగోలు చేసేలా ఒప్పందం కుదిరిందన్నారు. ఇంతలోనే వడగండ్ల వర్షానికి పంట దెబతినిందని వీరనారప్ప కన్నీరు పెట్టుకున్నారు. అలాగే నాగమునెమ్మ 3ఎకరాలు కౌలుకు తీసుకుని పంట సాగు చేయగా.. వడగండ్ల వర్షానికి పంట మొత్తం పోయిందని బాధిత రైతు వాపోయారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ఎవరూ అధైర్యపడవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. చేతికొచ్చిన పంటలు దెబ్బతినడం చాలా బాధాకరమన్నారు. ఏ రైతును కదిలించినా కన్నీరు వస్తోందన్నారు. ఈ పంట నష్టంపై ఇప్పటికే రెవెన్యూ, హార్టికల్చర్ అధికారులు అంచనాలు వేస్తున్నారన్నారు. ఇందులో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా నివేదికలను పంపాలని అధికారులను కోరారు. కచ్చితంగా బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని శ్రీరామ్ స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కూచి రాము, మాజీ ఎంపిపి కొడిదెల రాజశేఖర్, కొడిదెల సాయి, మద్దినేని రమణ, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, నరసింహ, నారాయణస్వామి, పూలకుంట రామారావు, నాయన పల్లి గంగాధర్, ముసుగు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ :** వివిధ అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను ముగ్గురికి పరిటాల శ్రీరామ్ పంపిణీ చేశారు. పెద్దకోట్ల గ్రామానికి చెందిన మల్లేసుకు రూ.25వేలు, చిన్నచిగుళ్లరేవు గ్రామానికి చెందిన వీరారెడ్డికి రూ.45వేలు, తాడిమర్రి గ్రామానికి చెందిన చింతమ్మకి రూ.2.82లక్షల ప్రకారం మొత్తం రూ. 3.53 లక్షల విలువైన చెక్కులను అందజేశారు.

## వీధి దీపాలు ఏర్పాటు చేయండి

**ప్రజాశక్తి - మడకశిర రూరల్**

పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం నుండి బేగార్లపల్లి క్రాస్ వరకు వీధి దీపాలను ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ మార్గంలో బాలికల గురుకుల పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వసతిగృహాలు ఉన్నాయి. వీటితో పాటు పలువురు నివాసముంటున్నారు. చీకటి సమయంలో ఈ వీధి మీదుగా రావడానికి వెళ్లడానికి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాల, డిగ్రీ కళాశాల కొండ ప్రాంతంలో ఉండటంతో సాయంత్రం, వేకువజాము సమయాలలో ఎలుగుబండ్లు ఇతర వన్యప్రాణులు సంచరిస్తూ రోడ్డును దాటుతూ ఉంటాయి. దీనివలన ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలను ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

## నేడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆధ్వర్యంలో పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం బుధవారం పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన వెలువడింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేయనున్నారని ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది తెలిపారు.

## చలివేంద్రం ఏర్పాటు

**ప్రజాశక్తి - కొత్తచెరువు**

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహశీల్దార్ నీలకంఠ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. దాతలు ముందుకు వచ్చి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిటి బాలాంజినేయులు, ఆర్ఐ కిరణ్, వీఆర్వో నజీర్, మానవ హక్కుల సంఘం నాయకులు పాపన్న, విఆర్ఎలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయం పరిశీలన

**ప్రజాశక్తి - గాండ్లపెంట**

స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్నికదిరి డిఎస్పి శివ నారాయణ స్వామి మంగళవారం పరిశీలించారు. సమావేశం గది పరిసరాల ప్రాంతాలను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27న జరిగే ఎంపీపీ ఎన్నిక కోసం ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా తనిఖీలు చేపట్టామన్నారు. ఎంపీపీ ఎన్నిక ప్రశాంతంగా నిర్వహించాలని ఆయన తెలిపారు అలాగే కార్యాలయం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ నాగేంద్ర, ఇన్‌ఛార్జి ఎస్ఐ వలిబాషా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## తాగునీటి సమస్యను పరిష్కరించండి

**ప్రజాశక్తి - నంబులపూలకుంట**

మండల పరిధిలోని ఎదురు దొన పంచాయతీలోని దళితవాడలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని మాజీ ఎంపీటీసీ రమణయ్య కోరారు. ఈ మేరకు ఆయన గ్రామ ప్రజలతో కలసి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి అంజనప్పకు సమస్యను వివరించారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని ఎంపిడిఒ హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో శ్రీరాములు వెంకటరమణ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

## ఐఆర్ ప్రకటించాలి

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

ప్రభుత్వం ఐ ఆర్ ను వెంటనే ప్రకటించి, బకాయి ఉన్న డి ఏ లను చెల్లించాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. శ్రీ సత్య సాయి జిల్లా ఉద్యోగుల సంఘం సమావేశం సత్యసాయి విమానాశ్రయం వద్దగల ఏ పీ జీ ఈ ఏ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు భాస్కర్ రెడ్డి తాలూకాలోని ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కారానికి సత్య సాయితాలూకా అధ్యక్షులు లక్ష్మీనారాయణ రెడ్డి ,ప్రధాన కార్యదర్శి బి వి రమణ సహకారం అందిస్తారని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అవసరమైనప్పుడు జిల్లా అధ్యక్షులుతో కలసి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు చంద్ర నాయక్, నాగ సురేష్, మల్లికార్జున, చంద్రకళ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంప్రసాద్,జాయింట్ సెక్రటరీలు రమణ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మోహన్ కుమార్,ఫక్రుద్దీన్ , నిరంజన్ రెడ్డి, లక్ష్మయ్య, కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు భోజన సౌకర్యం

**ప్రజాశక్తి-సోమందేపల్లి**

మండల కేంద్రంలోని జామియా మసీద్ సభ్యులు పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం మేజర్ పంచాయతీలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు అన్నదానం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్యకార్మికులు ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నారని వారిని గుర్తించి ప్రతి ఒక్కరూ చేతనైన సహాయాన్ని అందించాలని పేర్కొన్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లో సిబ్బందికి భోజన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామాంజి, జామియా మసీదు కార్యదర్శి అక్రమ్ బాషా, ముత్తువల్లి మహమ్మద్, టిడి బాబా, బంగారు షాపు షాషా, అన్సార్‌బాషా, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

### జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, పెనుకొండ ఆర్డీవో ఆనంద్, డిఎస్‌పి విజయ్ కుమార్, కమిటీ కన్వీనర్ శివ రంగ ప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, కమిటీ సభ్యులు వీర నారాయణ, శ్రీనివాస్ నాయక్, ఉమా శంకర్, రామాంజినప్ప, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పౌర హక్కుల పరిరక్షణ అత్యాచార నిరోధక చట్టాల అమలుపై సమీక్షించారు. అనంతరం జెసి మాట్లాడుతూ ప్రతి మూడు నెలల ఒకసారి కమిటీ సమావేశం నిర్వహించాలన్నారు. ఇప్పటివరకు ఆ చట్టాల అమలుపై జెసి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మానిటరి రిలీఫ్ క్రింద ఈ ఏడాది రూ.4.35 లక్షలు మంజూరు అయిందని ఇందులో రూ.2.41 లక్షలు సంబంధిత బాధితుల ఖాతాల్లో జమ అయిందన్నారు. మిగిలిన మొత్తం వారం లోపల బాధితుల ఖాతాల్లో జమ అవుతుందని అన్నారు. పోలీసులు రెవిన్యూ వారు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యటించి ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని జెసి సూచించారు. కమిటీ సభ్యుడు శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ, పెడపల్లిలో ఎస్టీల భూములు కబ్జాకు గురయ్యాయన్నారు. పలుమార్లు కమిటీ దృష్టికి తెచ్చిన ఫలితం లేదన్నారు పలు గ్రామాల్లో శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

**పారిశుధ్య కార్మికుల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత**

జిల్లావ్యాప్తంగా అనునిత్యం ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించే పారిశుధ్య కార్మికుల భద్రత సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. జిల్లాస్థాయి స్కేవెంజర్ పనితీరుపై మంగళవారం సమీక్షించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్లు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివ రంగ ప్రసాద్, కమిటీ సభ్యులు ఈశ్వరయ్య, గంగులప్ప, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, ఎల్ డి ఎం రమణ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధిక, జిల్లా గిరిజన శాఖ అధికారి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు అవసరమైన గ్లౌజులు, మాస్కులు, పనిముట్లు సకాలంలో అందించడానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ ప్రహల్లాద, పెనుకొండ, మడకశిర, ధర్మవరం కమిషనర్లు శ్రీనివాసులు, రంగస్వామి, కిరణ్ కుమార్, ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు గాండ్లపెంట ఎంపీపీ ఎన్నిక

### నలుగురు ఎంపీటీసీలు కనిపించకపోవడంపై సర్వత్రా చర్చ
### చామల గొంది ఎంపీటీసీ కిడ్నాప్ !?
### ఫిర్యాదు చేసిన ఎంపీటీసీ బంధువు

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

గాండ్లపెంట ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడడంతో ఆ పదవిని దక్కించుకునేందుకు పోటాపోటీగా ప్రయత్నాలు ముమ్మురంగా సాగిస్తున్న తరుణంలో మండలంలో హైడ్రామా నెలకొంది. 22న జరిగిన సర్వసభ్య సమావేశానికి సైతం వైసిపి కి చెందిన ఎంపీటీసీలు డుమ్మా కొట్టడంతో వైసీపీలో గుబులు మొదలైంది. అసలు కథ ఇక్కడ మొదలైంది. వెంటనే వైసీపీ నేతలు నలుగురు ఎంపీటీసీలను బెంగళూరుకు తరలించారన్న చర్చ నడుస్తోంది. ఇందులో చామాలగొంది ఎంపీటీసీ లక్ష్మీదేవిని వైసిపి నేతలు భయభ్రాంతులకు గురిచేసి కారులో వెంబడించి కిడ్నాప్ చేశారని ఎంపీటీసీ మరిది రవి నాయక్ ఈనెల 22న కదిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ అన్న, వదిన గత నాలుగు రోజులుగా కనపడలేదని వైసీపీ నేతలు కిడ్నాప్ చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని మీడియా సమావేశంలో ఆయన డిమాండ్ చేశారు. పిర్యాదుదారుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ మక్బూల్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషాతో పాటు కదిరి వైసిపి నేతలు సాధిక్‌బాషా, పరికి షామీర్, శ్రీకాంత్ రెడ్డి లపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇది ఇలా ఉండగా మరో ముగ్గురు ఎంపీటీసీలు గత నాలుగు రోజులుగా కనపడకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 27న జరిగే ఎంపీపీ ఎన్నికకు హాజరు కాకుండా ఉండేందుకు వైసిపి నేతలు ఎంపీటీసీ సభ్యులను బెంగళూరుకు తరలించినట్లు విశ్వసనీయ సమాచారం.

**ఎంపీపీ ఎన్నికపై సర్వత్రా ఉత్కంఠ**

గురువారం జరిగే గాండ్లపెంట ఎంపీపీ ఎన్నికపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎంపీటీసీ సభ్యులు హాజరు కాకుండా ఉండేందుకు వైసిపి నేతలు కుట్ర పన్నినట్లు టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

# ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

**ప్రజాశక్తి - బత్తలపల్లి**

ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపిపి బగ్గిరి త్రివేణి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దంపెట్ల సర్పంచి చల్లా కరుణాకర్‌నాయుడు మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చినా ఎలాంటి ప్రయోజనం కన్పించడం లేదని విమర్శించారు. గత సమావేశంలో చేసిన తీర్మాణాలను ఎంతవరకు పరిష్కరించారో చెప్పాలని ప్రశ్నించారు. ఇలాంటి సమావేశాలు ఎందుకు అని నిలదీశారు. సమావేశాలకు రావడం. ప్రశ్నించడం తప్ప ఏమి సాధిస్తున్నామని అన్నారు. స్పందించిన ఎంపీడీవో నరసింహానాయుడు మాట్లాడుతూ ఇకపై జరిగే సమావేశంలో అధికారులకు పంపే తీర్మానాలు, తదితర విషయాలను తెలియజేస్తామన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కోటి సుధ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ జ్యోతి, వ్యవసాయాధికారి ఓబిరెడ్డి,ఏడి శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో సర్పంచులు సానే జయచంద్రారెడ్డి, కరుణాకర్ నాయుడు, ప్రభాకరరెడ్డి, కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్, పశు వైద్యాధికారి గుర్నాథరెడ్డి, ఎంఇఒ చాముండేశ్వరి, వీఎస్ డాక్టర్ లక్ష్మీనరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## వేలం పాటతో రూ.13 లక్షల ఆదాయం

**ప్రజాశక్తి - చిలమత్తూరు**

చిలమత్తూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని సంత, పంచాయతీ కాంప్లెక్స్ రూములు, జంతువధశాల నిర్వహణకు మంగళవారం నిర్వహించిన వేలం పాటలో పంచాయతీకి రూ. 13 లక్షల ఆదాయం సమకూరినట్లు కార్యదర్శి సావిత్రి, సర్పంచి సంధ్య తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఎక్కువ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ ప్రభుదాస్, బిల్ కలెక్టర్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు భోజన సౌకర్యం

**సోమందేపల్లి :** తొగటవీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ప్రతినెల చివరి మంగళవారం ప్రభుత్వ వైద్యశాలలోనిర్వహించే గర్భిణీలకు అన్నదాన కార్యక్రమాన్ని మంగళవారం యధావిధిగా నిర్వహించారు. తొగటవీర క్షత్రియ సంఘం సభ్యుడుజగదీష్ జన్మదినాన్ని పురస్కరించుకొని జగదీష్ లక్ష్మి దంపతులు గర్భిణీలకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు ఓంకార్, సూపర్‌వైజర్ రవీంద్ర, తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సి సి హరిదాస్, ఎంపీటీసీ పూజారి ఈశ్వరయ్య, శివ, బండారి శీన, గూడూరు రమేష్, సీఎం సురేష్, రామంజి ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## డీలర్ల సమస్యలపై వినతి

**ప్రజాశక్తి - ధర్మవరం రూరల్**

వినతిపత్రం అందజేస్తున్న డీలర్లు

మండలంలోని ఆయాగ్రామాలకు చెందిన డీలర్లు తమ సమస్యలపై స్థానిక తహశీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ ప్రతి ఒక్క షాప్ లో 15 క్వింటాళ్ల బియ్యానికి నాలుగు క్వింటాళ్లు తక్కువ వస్తున్నాయన్నారు. దీంతో బియ్యం పంపిణీ చేయాలంటే ఇబ్బందులు పడుతున్నామన్నారు. అదేవిధంగా హమాలీలు సమస్య కూడా ఉందన్నారు. ప్రతి షాప్ కి వెయ్యి రూపాయలు ఇస్తేనే బియ్యం దింపుతామని చెబుతున్నారన్నారు. ఈ విషయంపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డీలర్లు కోరారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం నాయకులు మహేష్ చౌదరి, లక్ష్మన్న, స్టోర్ డీలర్లు వి జయసారధి, రాంమోహన్ రెడ్డి, రవి, సుధాకర్ నాయుడు, రాఘవ రెడ్డి, వెంకటరాముడు, బాలప్ప, నాగనంద, రామాంజనేయులు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# హామీ మేరకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం

### మెగా జాబ్‌మేళాలో ఎమ్మెల్యే కందికుంట

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. ఎమ్మెల్యే చొరవతో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కదిరి రూరల్ ఎర్రదొడ్డి గంగమ్మ మోరీ వద్ద ఉన్న బ్లూమూన్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో వివిధ కంపెనీలతో మాట్లాడి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కనిపిస్తున్నామని చెప్పారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల వ్యత్యాశాలను నిరుద్యోగులు గమనించాలని సూచించారు. దేశాన్ని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లే శక్తి యువతకు ఉందన్నారు. ప్రతి యేటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని ప్రగల్బాలు పలికిన జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగులను అడుగడుగునా మోసం చేసిన విషయాన్ని గుర్తించుకోవాలని తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాకు 25 కంపెనీల ప్రతినిధులు హాజరు కాగా జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరుద్యోగులు తరలి వచ్చి ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ను బ్లూ మూన్ విద్యాసంస్థల అధినేత ఎం శివశంకర్, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వివిఎస్ శర్మ, బ్లూ మూన్ విద్యాసంస్థల అధినేత ఎం శివ శంకర్ ,డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటరెడ్డి, స్కిల్ డెవలప్మెంట్ జిల్లా ఆఫీసర్ హరికృష్ణ, కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# లైంగిక వేధింపులపై అప్రమత్తత అవసరం

సదస్సులో మాట్లాడుతున్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మీ హారిక కోట

**ప్రజాశక్తి-హిందూపురం**

లైంగిక వేధింపుల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి లలితాలక్ష్మీ హారిక కోట సూచించారు. ముఖ్యంగా ఆడపిల్లల విషయంలో తల్లులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో లైంగిక వేధింపులు, బాల్యవివాహాల నిరోధంపై న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సులో న్యాయమూర్తితో పాటు మున్సిపల్ చైర్మన్ డి ఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, ఆడపిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా మంచి స్పర్శ, చెడు స్పర్శలపై ఆడపిల్లలకు సరైన అవగాహన కల్పించాలన్నారు. లైంగిక వేధింపులకు గురి చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని తెలియజేశారు. ఇలాంటి విషయాల్లో దాపరికాలు లేకుండా పిల్లలు తెలియజేసే విధంగా చూడాలన్నారు. అదే విధంగా రాజ్యాంగం నిర్దేశించిన వయసు మేరకే తల్లిదండ్రులు అమ్మాయిలకు వివాహం చేయాలన్నారు. అమ్మాయిలు సమాజంలో ఎదురవుతున్న సమస్యలను తల్లిదండ్రుల దృష్టికి తీసుకువస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆడిటింగ్ అధికారి శోభన్ రెడ్డి, న్యాయవాదులు రవిచంద్ర, మురళి, ఉదయ్ సింహారెడ్డి, ఈశ్వరప్ప, అనిల్ కుమార్, లోక్ అదాలత్ సిబ్బంది శారద, టిఎల్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు విజయలక్ష్మి, నళినాక్షి, సిఒలు నాగేశ్వరి, పరంజ్యోతి, వరలక్ష్మి, గంగ రత్న, తౌసిఫ్ అలీ ఖాన్, ఇబ్రహీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## భార్యను వేధించిన కేసులో నిందితుడికి పదేళ్లు జైలు

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

భార్యను వేధించిన కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, 5వేల రూపాయల జరిమానా విధిస్తూ అనంతపురం జిల్లా 4 వ జిల్లా (మహిళా కోర్టు) న్యాయమూర్తి శోభారాణి సోమవారం తీర్పు ఇచ్చారు. కేసు పూర్వాపరాల్లోకి వెళితే, పుట్టపర్తి మండలం వెంకట గారి పల్లికి చెందిన చాకలి సావిత్రిని ముదిగుబ్బ మండలం పోడరాళ్లపల్లితండాకు చెందిన చాకలి రాజశేఖర్‌కు ఇచ్చి 2016 సంవత్సరంలో పెళ్లి చేశారు. పెళ్లి తర్వాత రాజశేఖర్ సావిత్రి ముదిగుబ్బలో కాపురం పెట్టారు. ఆరు నెలల తర్వాత రాజశేఖర్ తన భార్యపై అనుమానం పెంచుకున్నాడు. నిత్యం తిడుతూ, కొడుతూ ఉండేవాడు. రాజశేఖర్ వేధింపులు భరించలేక సావిత్రి పుట్టింటికి వచ్చింది. అయినా కూడా రాజశేఖర్ నాలుగైదు సార్లు సావిత్రి పుట్టింటికి వచ్చి ఇక్కడ కూడా తిట్టి కొట్టి చంపుతానని బెదిరించి వెళ్లేవాడు. ఓసారి సావిత్రికి మామ అయిన ఓబులేసుకు చెందిన సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో 11-10-2017న మధ్యాహ్నం మూడు గంటల సమయంలో రాజశేఖర్ తన భార్య సావిత్రికి ఫోన్ చేసి తాను అరటికాయ లోడు వేసుకొని డ్రైవింగ్ పని మీద వెళుతున్నానని వెంకట గారి పల్లి క్రాసులోకి వస్తే ఓబులేసు సెల్ ఫోన్ నీకు ఇస్తానని చెప్పాడు. దీంతో సావిత్రి విషయాన్ని తన అమ్మకు చెప్పి తన బావ రామును, తన అక్క కొడుకు అయిన సాయికృష్ణ , అతని స్నేహితుడు సాయికుమార్‌ను తోడు తీసుకొని సాయంత్రం 4:30 గంటల సమయంలో వెంకట గారి పల్లి క్రాస్ వెళ్లింది. అయితే అప్పటికే అక్కడున్న వంక దగ్గర కంపచెట్లలో నక్కి ఉన్న రాజశేఖర్ పరిగెత్తుకుంటూ సావిత్రి ఎడమ భుజం వెనుక, కుడిపక్క గొంతు కింద కత్తితో రెండు పోట్లు పొడిచాడు. వెనుకే వస్తున్న సాయికృష్ణ, సాయికుమార్, రాము గట్టిగా అరిచేసరికి రాజశేఖర్ అక్కడినుంచి పారిపోయాడు. అదే సమయంలో అటువైపు వస్తున్న వెంకట గారి పల్లి గ్రామ సర్పంచి చిన్న రామప్ప అది చూసి 108కు ఫోన్ చేసి గాయపడిన సావిత్రి ని పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తీసుకొని పోయి వైద్యం చేయించారు.ఆ మరుసటిరోజు బాధితురాలు సావిత్రి తనకు జరిగిన అన్యాయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ధనుంజయ కేసు నమోదు చేయగా ఎస్ఐ శాతిలాల్ దర్యాప్తు నిర్వహించి ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో రాజశేఖర్‌పై కేసు ఋజువు కావడంతో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, 5 వేల జరిమానా విధిస్తూఅనంతపురం జిల్లా 4 వ జిల్లా (మహిళా కోర్టు) న్యాయమూర్తి శోభారాణి సోమవారం తీర్పును వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరపున సుజన బలమైన వాదనలు వినిపించారు. ఈ కేసులో సమగ్రమైన దర్యాప్తు జరిపిన పోలీసులను జిల్లా ఎస్పీ వి రత్న అభినందించారు.

## వాహనాల పట్టివేత

**ప్రజాశక్తి - బత్తలపల్లి**

మండలంలోని చిత్రావతి నదిలో ఇసుకను అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనాలను పట్టుకొని-పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని రామాపురం సమీపంలోని చిత్రావతి నదిలో జేసీబీ సాయంతో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం అందినట్లు తెలిపారు. సమాచారం అందిన వెంటనే అక్కడికి తమ సిబ్బందితో వెళ్లినట్లు తెలిపారు. అక్కడ లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉన్న జేసీబీ, ట్రాక్టరును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వాటిని పోలీస్ స్టేషన్కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## సిఐగా నగేష్ బాబు బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి - మడకశిర**

అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సిఐగా నగేష్ బాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సిఐ రాగిరి రామయ్య స్థానంలో నగేష్ బాబు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు.

## జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు సోమవారం జిల్లాలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో ప్రజల భద్రత, రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు, ఫుట్ పెట్రోలింగ్ లు చేపట్టారు. రోడ్లపై ఆకతాయిల చేష్టపై దృష్టిసారించారు. ప్రధానంగా రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు.

**ముదిగుబ్బ :** పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని టిఎన్ పాళ్యం గ్రామంలో ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామరావు, పట్నం, తాడిమర్రి ఎస్ఐలతో కలసి కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ప్రజలు ఫ్యాక్షన్ దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్నం, తాడిమర్రి పోలీసులు పాల్గొన్నారు.

**గాండ్లపెంట :** మండల పరిధిలోని కటారుపల్లి పంచాయతీలోని గజ్జలవాడపల్లిలో పోలీసులు మంగళవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు.కదిరి రూరల్ సిఐ నాగేంద్ర ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు వలిబాషా, నరసింహుడు, గోపీ, పోలీసులు తదితరులు పాల్గొన్నారు

## ఆదర్శనీయుడు ఎల్‌జి.హావనూరు

**ప్రజాశక్తి - పావగడ**

ఎల్.జి. హావనూరు ఆదర్శనీయుడని వెనుక బడిన వర్గాలకు ఎంతో మేలు చేశారని నీడగల్లు వాల్మీకి ఆశ్రమ అధ్యక్షుడు వాల్మీకి సంజయ్ కుమార్ స్వామీజీ తెలిపారు. పట్టణంలోని కుమారస్వామి వీధిలోని వాల్మీకి ఆలయ ఆవరణలో ఎల్.జి. హవనూరు 100వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వెనుకబడిన వర్గాలకు అయన సమర్పించిన నివేదిక ఎంతో ఉపయోగకారిగా ఉందన్నారు. వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం చేసిన మహోన్నత వ్యక్తి హవనూరు అని అన్నారు. అయన విగ్రహాన్ని విధానసౌధ ఎదుట నిర్మించాలని సంజయ్ కుమార్ స్వామీజీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల కర్నాటక వాల్మీకి తుమకూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలెగార్ లోకేష్, పావగడ వాల్మీకి యువజన సంఘం అధ్యక్షులు నరసింహకృష్ణ, ఆంజనాయక్, మాజీ తాలూకా పంచాయతీ సభ్యుడు. నరసింహులు. ఓంకార నాయక్. నాగరాజ్, మంజునాథ్, అంబికా రమేష్, ప్రకాష్, బ్యాడ నూర్ , శివ. బలరాం, లక్ష్మీనారాయణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

**ప్రజాశక్తి - పావగడ**

చిన్నారుల్లో పోషకాహార లోపం, బాలికల్లో రక్తహీనత తగ్గించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2018లో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని అమలు చేసిందని స్త్రీ, శిశు అభివృద్ధి సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చేతన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం తాలూకాలోని నాగలమడిక హోబలి శ్రీరంగాపుర తండాలో స్త్రీ, శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం ద్వారా గర్భిణులకు సామూహిక సీమంతం, పిల్లలకు అన్నప్రాసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చేతన్‌కుమార్ మాట్లాడుతూ గర్భిణులు గర్భం దాల్చినప్పటి నుండి పిల్లలకు రెండేళ్లు నిండే వరకు సరైన పోషకాహారం తీసుకోవాలన్నారు. ప్రసవానికి ముందు అంగన్‌వాడీ కార్యకర్తలతో కౌన్సెలింగ్ ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ, శిశు అభివృద్ధి శాఖ జిల్లా సంచాలకుడు దినేష్‌కుమార్, సీడీపీవో సునీతా గోపాల్, తుమకూరు నగర, రూరల్ సీడీపీవోలు, గ్రామంలోని గర్భిణులు, చిన్నారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

**హిందూపురం :** పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం హిందూపురం రూరల్ మండలం గోళాపురం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి కేంచరాయప్ప ఆధ్వర్యంలో తడి, పొడి, ప్రమాదకర చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తడి, పొడి చెత్త విడివిడిగా కేటాయించి పారిశుధ్య నిర్వహణ బండ్లు వచ్చినప్పుడు వారికి అందజేయాలని సూచించారు. తడి,పొడి చెత్త సేకరించి డంపింగ్ యార్డులకు తరలించి సేంద్రియ ఎరువులు తయారీకి వినియోగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చేయొద్దు

నార్పలలో అవగాహన కల్పిస్తున్న వక్తలు

**ప్రజాశక్తి-నార్పల**

బాలికలకు వివాహాలు చేయొద్దని ఆరోగ్య విద్యా బోధకురాలు పర్వీన్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బి.పప్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక వైద్యశాల వైద్యురాలు హాజీరా ఆధ్వర్యంలో లింగ వివక్ష, బాల్య వివాహాల నిర్మూలన, నివారణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు 18, మగ పిల్లలకు 21ఏళ్లు వచ్చిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. అలాకాకుండా బాలికలకు వివాహాలు చేస్తే అనేక దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అంతేగాకుండా బాల్య వివాహం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీరాములు, అనసూయమ్మ, మహిళా పోలీస్ రాజేశ్వరి, పాఠశాల ఇన్‌ఛార్జి హెడ్‌మాస్టర్ ఆదినారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**గార్లదిన్నె :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ గౌతమి ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్య వివాహాలు, లింగ వివక్షపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సి.వెంకటేష్, సిహెచ్ఒ లోకనాథ్, సిహెచ్ఎన్ అరుణకుమారి, ఎంపిహెచ్ఎస్ విశ్వనాథ్, ఎఎన్ఎం సావిత్రి, హెచ్ఎం సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

**ఉరవకొండ :** మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి పావని ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన, టీనేజ్ గర్భధారణ నివారణ, వడదెబ్బపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగ రంగయ్య, హెల్త్ సూపర్వైజర్ శేఖర్, సిహెచ్ఒ హిమబిందు, హేమలత, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు ప్యాకెట్లను చూపుతున్న ఎంపిడిఒ

## అమ్మకానికి వర్మీ కంపోస్టు ఎరువు

**నార్పల :** మండల పరిధిలోని బొందలవాడలో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రంలో తయారైన వర్మీకంపోస్టు ఎరువు అమ్మకానికి సిద్ధంగా ఉంచినట్లు ఎంపిడిఒ గంగాదేవి తెలిపారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో వర్మీ కంపోస్టు ఎరువుల ప్యాకెట్లను ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ వర్మీ కంపోస్టు ఎరువు కావాల్సిన రైతులు బొందలవాడలో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రానికి వెళ్లి తీసుకోవచ్చన్నారు. కిలో ప్యాకెట్ల రూపంలో తయారు చేసి సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శైలజారాణి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## గంగ జాతర

**పెద్దపప్పూరు :** మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా సోమవారం రాత్రి నుండి అమ్మవారి కథతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున గ్రామస్తులందరూ భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

## 28న వేలంపాట

**కళ్యాణదుర్గం రూరల్ :** కంబదూరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 28న వేలంపాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సిఐ సునీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటలో పాల్గొనాలనుకునే వారు రూ.3వేలు ధరావతు చెల్లించి పాల్గొనాలని కోరారు.

## కంటి అద్దాల పంపిణీ

**యాడికి :** జాతీయ అంధత్వ నివారణలో భాగంగా ప్రభుత్వ జిల్లా సివిల్ సర్జన్ డాక్టర్ సైదన్న ఆదేశాల మంగళవారం మండల కేంద్రంలోని నెంబర్-4 ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి డివిజన్ జిపిఎంఒఒ మధుసూదనరాజు, ఎంఇఒ ఆర్.ధనలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు ప్రతిభారాణి, జి.పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలిక అదృశ్యం

**బెలుగుప్ప :** మండల పరిధిలోని ఆవులెన్న గ్రామానికి చెందిన మైనర్ బాలిక నిన్న సాయంత్రం తోటలోకి వెళ్లి వస్తానని తల్లిదండ్రులకు చెప్పి వెళ్లి కనిపించకుండా పోయినట్లు తండ్రి మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.

## కళాకారులకు ఆర్థికసాయం

**కళ్యాణదుర్గం రూరల్ :** పౌరాణిక కళాకారులకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు మంగళవారం రూ.30వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈనెల 29న పట్టణంలో ప్రదర్శించనున్న పౌరాణిక నాటకాన్ని తిలకించేందుకు రావాలని ఎమ్మెల్యేను కళాకారులు మంగళవారం ఆహ్వానించారు. ఇందుకు స్పందించిన టిడిపి నాయకులు దేవినేని ధర్మతేజ సంబంధిత మొత్తాన్ని కళాకారులకు అందజేశారు.

## పొలం బడి

**ముదిగుబ్బ :** మండలంలోని మంగళమడక, సానేవారిపల్లి గ్రామాలలో మంగళవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎఫ్‌పిఒలో సభ్యత్వం కలిగిన 11 మంది రైతుల పంట పొలాలను ఎపిఎస్ఒపిసిఒ ఎక్స్టర్నల్ ఇన్స్ట్రక్టర్ రవి, సత్యసాయి జిల్లా ఏవాల్యూయేటర్ వెంకటేష్, మండల వ్యవసాయ అధికారి లక్ష్మి నరసింహులు పరిశీలించారు. వ్యవసాయ యాజమాన్య పద్ధతులను వివరించారు. విత్తన ధ్రువీకరణ ప్రాముఖ్యతను తెలిపారు. విత్తన నమూనాలను సేకరించి వాటిని పురుగు మందుల అవశేషాల నిమిత్తం బెంగళూరు ల్యాబ్ కు పంపుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ షరీఫ్, ఎఫ్‌పిఒ లక్ష్మీదేవి, ఎపిఎం హేమలత, ఎంపిఇఒ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

## టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడికి ఘన స్వాగతం



టిడిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

**ప్రజాశక్తి-అనంతపురం**

అనంతపురానికి వచ్చిన టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ టిడి జనార్ధన్‌కు టిడిపి నాయకులు మంగళవారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, తదితరులు పుష్పగుచ్చాలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు పిఎల్ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, తెలుగుమహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, ఆర్యవైశ్య నాయకులు తాటి మధు, టిడిపి నాయకులు నెట్టెం బాలకృష్ణ, ఓంకార్‌రెడ్డి, గోపాల్‌గౌడ్, మాజీ ఎంపిపి ఇస్మాయిల్, తెలుగు మహిళా నాయకురాళ్లు వడ్డే భవాని, చరిత, ఆయేషా, తదితరులు పాల్గొన్నారు.

## దంతాలను సంరక్షించుకోవాలి

**ప్రజాశక్తి-గుత్తి**

విద్యార్థులు ఆరోగ్యంతోపాటుగా దంతాలను సంరక్షించుకోవాలని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి దంత వైద్యురాలు ప్రశాంతి సూచించారు. మంగళవారం మండలంలోని బేతాపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వరల్డ్ ఓరల్ హెల్త్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రతి రోజు దంతాలను శుభ్రంచేసుకోవాలన్నారు. ఎక్కువ సేపు పళ్లు తోమరాదన్నారు. ప్రతి విద్యార్థి హ్యాపీ మౌత్.. హ్యాపీ మైండ్ అనే నినాదంతో జీవిత కాలం దంతాలతో జీవించాలని అన్నారు.మార్చి 20 నుంచి ఏప్రిల్ 20 వరకూ మండలంలోని అన్ని పాఠశాలలు, గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించి విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బేతాపల్లి పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, హెచ్ఎం మహాలక్ష్మి, ఉపాధ్యాయులు రామకృష్ణయ్య, ఓబుళపతి, వైద్య ఆరోగ్య సూపర్‌వైజర్లు లాజరస్, ఆంజనేయులు, శ్యామల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ చేసుకోండి

**శింగనమల :** రైతులు మీ పరిధిలోని రైతుసేవా కేంద్రాలకు వెళ్లి విశిష్ట నంబర్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అన్వేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఇప్పటి వరకూ కేవలం 2501 మంది రైతులు మాత్రమే రిజిస్టర్ చేసుకున్నారన్నారు. మిగిలిన రైతులు త్వరలోనే చేసుకోవాలని కోరారు.

## అన్న క్యాంటీన్ తనిఖీ

**గుత్తి :** పట్టణంలోని గాంధీ కూడలి సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు, ఆన్‌లైన్ సిస్టం ద్వారా ప్రజలకు అందిస్తున్న టోకన్లు, సేవలు, సౌకర్యాలను పరిశీలించారు. ప్రస్తుత వేసవికాలం సందర్భంగా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్‌బాషా, ఎఇ హరికిరణ్, శానిటేషన్ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు నిత్యావసరాలు అందజేత

**పుట్టపర్తి రూరల్ :** ప్రభాత్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ మహిళా చేయుత కేంద్రం సెక్రటరీ ఆర్. ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మంగళవారం పుట్టపర్తి మండలంలోని పెడబల్లి గ్రామంలో వందమంది పేద మహిళలకు గుర్తించి వారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి 2కేజీల గోధుమపిండి, కేజీ కంది బేడలు, చక్కెర,రవ్వ, సేమియా, వంటనూనెతో కూడిన ఆరురకాల సరుకుల కిట్‌ను ఎస్ఐ లింగన్న చేతుల మీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో కంటి డాక్టర్ డాక్టర్ బషీర్ అహ్మద్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందు

రంజాన్ తోఫా పంపిణీలో అనంత వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న ముస్లిములు

**ప్రజాశక్తి-అనంతపురం**

పివికెకె ఇంజినీరింగ్ కాలేజీలో మైనార్టీ సెల్, స్టూడెంట్ యాక్టివిటీ సెల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముందుగా కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్ ముస్లిములకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత కీ నోట్ స్పీకర్‌గా విశ్రాంత డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అమీర్‌బాషా రంజాన్ పవిత్రత, ఉపవాస దీక్ష గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మేనేజర్ అనురాగ్‌రెడ్డి, స్టూడెంట్ యాక్టివిటీ సెల్ కన్వీనర్ ఆనంద్ డాంపెల్లా, మైనార్టీ సెల్ కన్వీనర్ బాబా సలాహుద్దీన్ పాల్గొన్నారు.

**అనంతపురం :** రంజాన్ పండుగను పురస్కరించుకుని వైసిపి మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నియాజ్ ఆధ్వర్యంలో నగరంలోని రామ్‌నగర్‌లో ఉన్న క్యాన్ పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ప్రారంభించారు.

## విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

**ప్రజాశక్తి-అనంతపురం**

పిఎం విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు వడ్డే వెంకటేశులు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని వడ్డే వెంకటేశులు వ్యక్తిగత కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ సూచనలతో ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద 18 రకాల కుల వృత్తులకు శిక్షణ ఇచ్చి రోజు కూలి రూ.500 ఇస్తూ రుణ సదుపాయం కూడా కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ టీం పవన్‌కుమార్, సుధాకర్, మహిళా సంఘాల ఆర్పీలు, మహిళా నాయకురాలు గౌరీ, పద్మావతి, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ కానుక పంపిణీ

**రాయదుర్గం :** రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని మక్కా మసీద్ యూత్ ఆర్గనైజేషన్ 400 నిరుపేద ముస్లిం కుటుంబాలకు మంగళవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి, పోలీస్ ఇన్స్‌పెక్టర్ జయానాయక్ దాదాపు 400 కిట్లు పేదలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఖాజీ సైఫుల్లా, ముస్లిం మత పెద్దలు అయుబ్ ఖాన్, మున్సిపల్ ఇంజినీర్ రవిప్రకాష్ నాయుడు, మక్కా మసీద్ యూత్ ఆర్గనైజేషన్ ప్రతినిధి మహమ్మద్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు

## నేడు గుమ్మఘట్టలో ప్రజాదర్బార్

**రాయదుర్గం :** నియోజకవర్గం పరిధిలోని గుమ్మఘట్ట మండల కేంద్రంలో ఐకెపి కార్యాలయంలో బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటన వెలువడింది. ఈ కార్యక్రమానికి విప్ కాలవ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మట్కా నిర్వాహకుల అరెస్టు

**పామిడి :** పామిడి పోలీస్ స్టేషన్ పరిధిలో మట్కారాస్తున్న నలుగురు అరెస్ట్.వారి వద్ద నుంచి 4,300 నగదు, 2 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ దగ్గర మట్కా రాస్తున్నారనే సమాచారంతో దాడులు చేసి మట్కా బీటర్లను అరెస్ట్ చేశామని సిఐ యుగంధర్ తెలిపారు. నలుగురిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో పోలీసులు రామాంజనేయులు, శ్రీనివాసులు, రవీంద్ర, ఇమ్రాన్ పాల్గొన్నారు.